బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 04 సెప్టెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

# 6న సాధారణ సెలవు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ చుట్టుపక్కల ఈనెల ఆరో తేదీన గణేష్ నిమజ్జనం జరగనుంది. దీంతో ఈనెల ఆరో తేదీన రాష్ట్ర ప్రభుత్వం సాధారణ సెలవును ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్-సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కాలేజీలకు సాధారణ సెలవు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. వచ్చేనెల రెండో శనివారం ఆయా జిల్లాల్లో పనిదినంగా ఉంటుందని స్పష్టం చేశారు.

# నేను ఎవరి వెనుకా లేను...

నా పని తెలంగాణ ప్రజలకు
అండగా నిలబడటం
మీ పంచాయితీల్లోకి మమ్మల్ని లాగొద్దు
అవినీతి పంపకాల్లో తేడా వల్లే తగాదాలు..

- పాలమూరును అభివృద్ధి పథంలో నడిపే ధర్మం నాదే
- వలసల చరిత్రకు ముగింపు
- విద్యతో తలరాత మారుస్తాం
- జిల్లాకు రెండో ట్రిపుల్ ఐటీ, ఇంజనీరింగ్, లా, మెడికల్ కాలేజీలు
- 14 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు
- గ్రీన్ ఛానెల్ నిధులతో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి
- భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం
- సీఎం రేవంత్‌రెడ్డి
- మహబూబ్‌నగర్ జిల్లా వేములలో ఎస్‌జీడీ - కార్నింగ్ టెక్నాలజీస్ సంస్థ నిర్మించిన నూతన యూనిట్ ప్రారంభం

## మహబూబ్‌నగర్‌కు నూతన పరిశ్రమలు




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కరవు, కాటకాలతో అల్లాడుతున్న ఉమ్మడి పాలమూరు పేదరికాన్ని పరిశీలించడానికి విదేశాల నుంచి బృందాలు వచ్చే పరిస్థితి నుంచి జిల్లాను సమున్నత స్థానంలో నిలబెట్టడం తన నైతిక ధర్మమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దశాబ్దాల కరవు, వెనుకబాటుతనం, వలసల నుంచి బయటపడేందుకు ముఖ్యమంత్రి రూపంలో దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విద్య, నీటి పారుదల, ఉద్యోగ ఉపాధి రంగాల్లో ఉమ్మడి పాలమూరును ఉన్నత స్థానంలో నిలబెట్టాల్సిన అవసరం ఉందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని వేముల గ్రామంలో ప్రఖ్యాత ఎస్‌జీడీ - కార్నింగ్ టెక్నాలజీస్ సంస్థ నిర్మించిన నూతన యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

### పేదల భవిష్యత్తుకు చదువే మార్గం

- అందుకు ఎంతైనా ఖర్చు చేయడానికి సిద్ధం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమం

మిగితా 2వ పేజీలో

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "రాబోయే రోజుల్లో మహబూబ్ నగర్ జిల్లాకు నూతన పరిశ్రమలకు రాబోతున్నాయి. స్థానిక యువతకే కాదు, రాష్ట్రంలో చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఈ జిల్లా వేదిక కాబోతోంది. పాలమూరు జిల్లా అంటే ఒకనాడు వలసలకు మారుపేరు. దేశంలో ఎక్కడ ఏమూలన ప్రాజెక్టులు కట్టినా వాటి నిర్మాణాల్లో పాలమూరు కూలీలు భాగస్వాములయ్యారు. విద్యావకాశాలు, నీటి వసతులు లేని కారణంగా పాలమూరు బిడ్డలు కూలీలుగా దేశం నలుమూలలకు వలసపోయేది.

ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, కల్వకుర్తి ఎత్తిపోతల, జూరాల, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, బీమా వంటి ఏ ప్రాజెక్టులూ పూర్తికాలేదు. ఆనాడు సోనియా గాంధీ గారు పాలమూరు యూనివర్సిటీని మంజూరు చేసినా, దానికి ఇంజనీరింగ్ కాలేజీగానీ, లా కాలేజీ గానీ లేని కారణంగా అది పీజీ కాలేజీ స్థాయిలోనే మిగిలిపోయింది. హైదరాబాద్ రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణా రావు తర్వాత 70 ఏండ్లకు

మిగితా 2వ పేజీలో

# ప్రజలకు కేంద్రం బొనాంజా

- 12%, 28% శ్లాబ్‌ల రద్దు
- ఇకపై 5%, 18% మాత్రమే
- ఆరోగ్య, జీవన బీమాలపై జీఎస్టీ రద్దు
- పాలు, బ్రెడ్, రోటీపై పన్ను సున్నా
- లగ్జరీ, హానికర వస్తువులపై 40% జీఎస్టీ
- సిగరెట్, గుట్కాకు భారీ పన్ను




**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ప్రజలకు కేంద్ర ప్రభుత్వం భారీ బొనాంజా ప్రకటించింది. జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు తీసుకుంది. చింది. జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇప్పటి వరకు అమల్లో ఉన్న 12%, 28% శ్లాబ్‌లు రద్దు చేస్తూ, ఇకపై 5%, 18% శ్లాబ్‌లు మాత్రమే కొనసాగించనుంది. హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్‌లపై పన్ను రద్దు చేసినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. పాలు, బ్రెడ్, రోటీ, చనాలు వంటి ప్రాథమిక వస్తువులపై పన్ను పూర్తిగా ఎత్తివేసింది. కొత్త నిబంధనలు ఈనెల 22వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. లగ్జరీ వస్తువులపై 40% పన్ను విధించింది.

### సామాన్యులకు ఊరట : నిర్మలా సీతారామన్

సాధారణ ప్రజలపై ఆర్థిక భారం పడకుండా జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు తీసుకుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇకపై రెండు శ్లాబులు మాత్రమే ఉంటాయని వెల్లడించారు. లైఫ్ సేవింగ్ డ్రగ్స్, ముఖ్యమైన మందులపై పన్ను తొలగించామని, సిమెంట్‌పై టాక్స్‌ను 28% నుంచి 18%కి తగ్గించామని వివరించారు. క్యాన్సర్ మందులపై కూడా జీఎస్టీ తొలగించారని పేర్కొన్నారు. "ఈజ్ ఆఫ్ లివింగ్ కోసం న్యూ జనరేషన్ రిఫార్మ్ చేశాం. ఎర్రకోటపై నుంచి ప్రధాని మోదీ జీఎస్టీ మార్పులకు పిలుపునిచ్చారు. ఆ దిశగా ముందుకు వచ్చాం. కామన్ మ్యాన్, మిడిల్ క్లాస్ వినియోగించే వస్తువులపై భారీగా పన్ను తగ్గించాం" అని ఆమె తెలిపారు.

### జీఎస్టీ కౌన్సిల్ ప్రధాన నిర్ణయాలు

అన్ని టీవీలపై 18% జీఎస్టీ
వ్యవసాయ పరికరాలపై పన్ను 12% నుంచి 5%కి తగ్గింపు
చాలా ఎరువులపై జీఎస్టీ 18% నుంచి 5%కి తగ్గింపు
చేనేత, మార్బుల్, గ్రానైట్‌పై 5% జీఎస్టీ
33 ఔషధాలపై పన్ను 12% నుంచి సున్నాకు తగ్గింపు
350 సీసీ లోపు వాహనాలపై 18% జీఎస్టీ
350 సీసీ పైగా వాహనాలపై 40% పన్ను
కార్బొనేటెడ్ కూల్‌డ్రింక్స్, జ్యూస్‌లపై 40% జీఎస్టీ
పాన్ మసాలా, సిగరెట్లు, గుట్కా, పొగాకు ఉత్పత్తులపై 40% జీఎస్టీ

### 5% శ్లాబ్‌లోకి వచ్చిన వస్తువులు

హెయిర్ ఆయిల్, టాయిలెట్ సబ్బులు, షాంపూలు
టూత్ బ్రష్‌లు, టూత్ పేస్ట్‌లు
సైకిళ్లు, టేబుల్‌లు, కిచెన్ వస్తువులు
వివిధ గృహావసర వస్తువులు

### 5% నుంచి పూర్తిగా జీఎస్టీ రద్దు

పాలు, పన్నీర్, బ్రెడ్
హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్
క్యాన్సర్ మందులు

### 12%, 18% నుంచి 5%కి తగ్గింపు

ఉప్పు, భుజియా, సాస్‌లు, పాస్తా, నూడుల్స్
చాక్లెట్లు, కాఫీ, నిల్వ చేసిన మాంసం
వెన్న, నెయ్యి, కార్న్‌ఫ్లేక్స్

# కవిత రాజీనామా

- బీఆర్ఎస్‌కు ఎమ్మెల్సీ పదవికీ రాజీనామా చేస్తూ స్పీకర్‌కు లేఖ
- హరీశ్‌రావు ట్రబుల్ షూటర్ కాదు.. ట్రబుల్ క్రియేటర్
- ఆరడుగుల బుల్లెట్ నన్ను గాయపరిచింది
- సంతోశ్‌కు ధనదాహం ఎక్కువ
- కాంగ్రెస్‌తో కలిసి కుట్ర చేశారు
- నా నిజామాబాద్ ఓటమి, కామారెడ్డిలో కేసీఆర్ ఓటమి వెనుక హరీష్ కుట్రలు
- రామన్నను ఓడించేందుకు సిరిసిల్లకు 60 లక్షలు పంపాడు
- ఏ పార్టీలోకి వెళ్లను
- అందరితో మాట్లాడాకే భవిష్యత్ కార్యాచరణ
- కల్వకుంట్ల కవిత



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం కీలక నిర్ణయం ప్రకటించారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించారు. స్పీకర్ ఫార్మాట్‌లో అధికారికంగా రాజీనామా సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తొలి మీడియా సమావేశంలో కవిత పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

"నా రాజకీయ జీవనానికి ప్రేరణ ఇచ్చినది నా తండ్రి కేసీఆర్. కోట్లలో ఒక్కరే ఆయన. అలాంటి నాయకుడు నాకు తండ్రిగా ఉండటం అదృష్టం. కానీ ఇద్దరు వ్యక్తులు మా కుటుంబాన్ని విచ్ఛిన్నం చేశారు. విధి వారిని వదిలిపెట్టదు" అని కవిత భావోద్వేగంగా చెప్పారు. తన సస్పెన్షన్ వెనుక బీజేపీతో హరీశ్‌రావు కుమ్మక్కై రేవంత్‌తో కలిసి కుట్రలు చేసినట్టు కవిత ఆరోపించారు. "రేవంత్‌తో హరీష్ ఒకే విమానంలో ప్రయాణించినప్పటి నుంచి నాపై కుట్రలు మొదలయ్యాయి. వ్యక్తిగత ప్రయోజనాల కోసం నన్ను పార్టీ నుంచి బయటకు నెట్టేశారు. పార్టీని హస్తగతం చేసుకునే ప్రయత్నమే ఇది" అని వ్యాఖ్యానించారు.

"హరీష్‌రావు ట్రబుల్ షూటర్ కాదు.. డబుల్ షూటర్. 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేలకి అదనపు ఫండింగ్ చేశాడు. రామన్నను ఓడించేందుకు సిరిసిల్లకు 60 లక్షలు పంపాడు. నా నిజామాబాద్ ఓటమి, కామారెడ్డిలో కేసీఆర్ ఓటమి వెనుక హరీష్ కుట్రలున్నాయి. ఈటల రాజేందర్, రఘునందన్‌రావు గెలుపులో కూడా హరీష్ పాత్ర ఉంది" అని కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

సంతోష్‌రావుపై కూడా కవిత మండిపడ్డారు. "గ్రీన్ ఇండియా చాలెంజ్ నకిలీ కార్యక్రమం. సినీ నటులను మోసం చేసి కార్యక్రమంలోకి లాగాడు. సిరిసిల్లలో దళిత పిల్లలపై దాడులకు సంతోష్‌రావే కారణం. ఆయన వల్ల కేటీఆర్‌కి, పార్టీకి నష్టం జరిగింది. సంతోష్‌తోనూ రేవంత్‌కు మ్యాచ్ ఫిక్సింగ్ ఉంది" అని ఆరోపించారు.

తాను ఏ పార్టీలోనూ చేరబోవడం లేదని కవిత స్పష్టం చేశారు. "కాంగ్రెస్‌లో గానీ, బీజేపీలో గానీ చేరడం లేదు. భవిష్యత్‌పై జాగృతి నేతలు, బీసీ నాయకులతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటాను. నాకు పదవులు ముఖ్యం కావు. తెలంగాణ ప్రజలే నాకు ముఖ్యం" అని తెలిపారు.



## రాష్ట్రానికి వరద సాయం అందించండి

- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్లూమ్ %డ% టెక్స్టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతుల సమస్యలు, అవసరాలను దృష్టిలో పెట్టుకుని పలు ముఖ్యమైన విజ్ఞప్తులు చేశారు. ఆయిల్ పామ్ గెలలకు టన్నుకు కనీస మద్దతు ధర రూ.25,000 ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా, ఆయిల్ పామ్ దిగుమతి సుంకాన్ని 44 శాతం వరకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలోని నారాయణపేట, ములుగు, కొమురంభీం ఆసిఫాబాద్, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను ప్రధాన్ మంత్రీ ధన్-ధాన్య కృషి యోజన పథకంలో చేర్చాలని అభ్యర్థించారు. వ్యవసాయ యంత్రాలు, మైక్రో ఇరిగేషన్ పరికరాలపై ప్రస్తుతం 12 శాతం జీఎస్టీ అమలులో ఉందని, రైతుల భారం తగ్గించేందుకు దీన్ని పూర్తిగా మినహాయించాలని మంత్రి కోరారు. యూరియాతో పోలిస్తే పాస్పరస్, పొటాషియం, సల్ఫర్ వంటి పోషకాల ధరలు ఎక్కువగా ఉన్నాయని, వీటిపై సబ్సిడీ పెంచి ధరల్లో సమతుల్యత తీసుకురావాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం యూరియా కొరత ఉందని పేర్కొంటూ, రానున్న 10 రోజుల్లో 60 వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాలని తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# ఏఐ క్యాపిటల్‌గా తెలంగాణ



- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణను 'ఏఐ క్యాపిటల్ ఆఫ్ ది గ్లోబ్'గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో అమెరికాకు చెందిన ప్రముఖ ఎంటర్‌ప్రైజ్ ప్రొక్యూర్‌మెంట్, సప్లయర్ కొలాబరేషన్ సంస్థ జాగర్‌కు చెందిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క టెక్నాలజీనే కాకుండా అన్ని రంగాలకు చెందిన ప్రపంచ దిగ్గజ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానంగా మారిందన్నారు. ఈ జాబితాలో జాగర్ కూడా చేరడంతో తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అవుతుందని అభిప్రాయపడ్డారు. "కొత్తగా ప్రారంభమైన జీసీసీ ద్వారా 180 మందికి ఉపాధి లభిస్తుంది. రాబోయే రోజుల్లో ఆ సంఖ్య 500కు చేరుతుంది. జాగర్ ఏఐ ప్లాట్ ఫాం, ఏఐ ఆధారిత ప్రొక్యూర్‌మెంట్ పరిష్కారాల అభివృద్ధికి వ్యూహాత్మక కేంద్రంగా పనిచేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా తయారీ, విద్య, ఎఫ్ఎంసీజీ, రిటైల్ తదితర రంగాలకు సాఫ్ట్‌వేర్, క్లౌడ్ ఆపరేషన్ సేవలను అందిస్తుంది' అని మంత్రి వివరించారు. జీసీసీల ఏర్పాటుకు తెలంగాణ అనుకూలమని చెప్పారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా గతేడాది 70 జీసీసీలు హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. ఈ ఏడాది 100 జీసీసీలను కొత్తగా ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. "ఏఐ రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు ప్రత్యేకంగా ఏఐ సిటీని అభివృద్ధి చేయనున్నాం. ప్రపంచానికి ఏఐ నిపుణులను అందించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ యూనివర్సిటీ, ఏఐ ఇన్నోవేషన్ హబ్ ను ఏర్పాటు చేయబోతున్నాం' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాగర్ సీఈఓ ఆండ్రూ రోస్కో, చీఫ్ డిజిటల్ ఆఫీసర్ గోపీనాథ్ పోలవరపు, చీఫ్ కస్టమర్ ఆఫీసర్ ట్రాయ్ మేయర్ తదితరులు పాల్గొన్నారు.

## 8 వేల కోట్లు పెట్టుబడులు.. 70 వేల ఉద్యోగాలు

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్రమంత్రి వర్గం కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. దేశంలో కీలక ఖనిజాల రీసైక్లింగ్‌ను ప్రోత్సహించేందుకు రూ.1,500 కోట్ల ప్రోత్సాహక పథకాన్ని ఆమోదించింది. ఈ పథకం 2025-26 నుంచి 2030-31 ఆర్థిక సంవత్సరాల వరకు ఆరు సంవత్సరాల పాటు అమల్లో ఉంటుంది.

ఈ పథకం ద్వారా సుమారు రూ.8,000 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 70 వేల ఉద్యోగాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ ప్రాజెక్టు నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌లో భాగంగా ఉంటుంది. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, హైటెక్ పరిశ్రమలకు అవసరమైన ఖనిజాల దేశీయ సరఫరా పెంపే దీని ప్రధాన లక్ష్యం.

ఈ పథకం కింద ఈ-వ్యర్థాలు, లిథియం అయాన్ బ్యాటరీ స్క్రాప్, పాత వాహనాల ఉత్ప్రేరక కన్వర్టర్లు, ఇతర స్క్రాప్ పదార్థాలు రీసైక్లింగ్‌కు వస్తాయి. లిథియం, కోబాల్ట్, నికెల్, రాగి వంటి విలువైన ఖనిజాలను తిరిగి ఉపయోగించే అవకాశం లభిస్తుంది.

ఈ పథకం కింద రెండు రకాల సబ్సిడీలు ఉంటాయి:
CAPEX సబ్సిడీ: కొత్త యూనిట్లు, యంత్రాల ఏర్పాటు కోసం 20 శాతం వరకు.
OPEX సబ్సిడీ: అమ్మకాల పెరుగుదల ఆధారంగా 2026-27 నుంచి 2030-31 వరకు 40-60 శాతం వరకు.

పెద్ద యూనిట్లకు గరిష్ఠంగా రూ.50 కోట్లు, చిన్న యూనిట్లు, స్టార్టప్‌లకు రూ.25 కోట్ల వరకు సబ్సిడీలు లభిస్తాయి. %ఊజుఞ% సబ్సిడీ పరిమితి పెద్దలకు రూ.10 కోట్లు, చిన్న యూనిట్లకు రూ.5 కోట్లుగా నిర్ణయించారు.

### చిన్న వ్యాపారాలకూ అవకాశం

మొత్తం రూ.1,500 కోట్లలో మూడో వంతు నూతన, చిన్న రీసైక్లర్లకు కేటాయించారు. ఈ పథకం ద్వారా పెద్ద పారిశ్రామికవేత్తలతో పాటు చిన్న వ్యాపారులు, స్టార్టప్‌లు కూడా ప్రయోజనం పొందనున్నారు.

## చెప్పుల జాతరగా హామీల జాతర

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. "ఎన్నికల ముందు హామీల జాతర.. ఎన్నికల తర్వాత చెప్పుల జాతర" అన్నట్టుగా రాష్ట్ర పాలన కొనసాగుతోందని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత ఊకంటి ప్రభాకర్ రావుతో పాటు 300 మంది కార్యకర్తలు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, సింగరేణి కార్మికులకు కేసీఆర్ చేసిన మేలును ప్రభాకర్ రావు వివరంగా చెప్పారని అన్నారు. అయితే ఆశ్చర్యకరంగా, సింగరేణి బెల్ట్‌లోని 13 నియోజకవర్గాల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయామని గుర్తుచేశారు. వారసత్వ ఉద్యోగాలు ఇచ్చామని, 10 హామీల్లో 8 హామీలు అమలు చేశామని తెలిపారు. అయినప్పటికీ, 2023 ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలిందని, అనంతరం కార్మిక సంఘ ఎన్నికల్లో కూడా పార్టీకి నష్టం జరిగిందని అన్నారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు అవుతున్నా, ప్రజల జీవన స్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని కేటీఆర్ విమర్శించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యూరియా కోసం రాత్రిళ్లు లైన్లు కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "హామీల జాతర ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు

మిగితా 2వ పేజీలో



## రాష్ట్రంలో రెండురోజుల వర్షాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం బలపడి బుధవారం తీవ్ర అల్పపీడనంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రానున్న 24 గంటల్లో ఇది జార?ండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ తీరాన్ని దాటే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. గురువారం, శుక్రవారం ఉరుములు, మెరుపులు, గంటకు 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

బుధవారం ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జగిత్యాల, కరీంనగర్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. రానున్న రెండు రోజులకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు వాతావరణ శాఖ స్పష్టం చేసింది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 3 వరకు రాష్ట్రంలో సాధారణంగా 593 మి.మీ. వర్షపాతం ఉండాల్సి ఉండగా, ఇప్పటివరకు 757.5 మి.మీ. వర్షపాతం నమోదైనట్టు తెలిపింది.

## జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టు ఎలా అందింది

రిటైర్డు ఐఏఎస్ అధికారి శైలేంద్ర కుమార్ జోషికి హైకోర్టు ప్రశ్న




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి ఇచ్చిన రిపోర్టు మీకు ఎలా అందిందో చెప్పాలని ఇరిగేషన్ శాఖ

మిగితా 2వ పేజీలో

# నేను ఎవరి వెనుకా లేను...

(మొదటి పేజీ తరువాయి)

మళ్లీ పాలమూరు బిడ్డ తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యాడు. ఈనాటి అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలి. శశభిషలకు తావులేకుండా, జిల్లాకు బాసర తర్వాత రెండో ట్రిపుల్ ఐటీని ఈ జిల్లాలో ఏర్పాటు చేశాం. ఇంజి నీరింగ్, లా, మెడికల్ కాలేజీ వచ్చినా, వెనుకబడిన ఈ ప్రాంతంలో, ఇక్కడి పేద పిల్లలకు అందుబాలోకి తేవాలని ప్రయత్నిస్తున్నాం.

పాలమూరు జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 14 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరుచేశాం. మొదటి యంగ్ ఇండియా స్కూలుకు షాద్‌నగర్‌లోనే శిలాఫలకం వేశాం. వలసలు పోయే మనం, మన తలరాతలను మార్చుకోవాలి. మన తలరాతను మార్చేది విద్య మాత్రమే. పాలమూరు జిల్లా నుంచి పిల్లలు విద్యా రంగంలో పైకి రావాలి. ఎదగాలంటే చదవాలి, చదవాలంటే వసతులు పెరగాలి. ఆ బాధ్యత నేను తీసుకుంటా. విద్యకు నిధులు అందించడంలో వెనుకడుగువేసేది లేదు.గ్రీన్ ఛానెల్‌లో నిధులు కేటాయించి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయించే ప్రయత్నం చేస్తున్నాం. ఉద్దండాపూర్, మక్తల్ నారాయణపేట్,

కొడంగల్ ప్రాంతాలకు నీళ్ల కోసం 2014లోనే జీవో 69 ద్వారా ప్రాజెక్టును తెచ్చుకుంటే, గత పాలకులు పదేండ్లు ఆ ప్రాజెక్టును అడ్డుకున్నారు. ఈ ప్రాంతానికి అన్యాయం చేశారు. ఆ ప్రాజెక్టును ఇప్పుడు ముందుకు తీసకెళుతుంటే గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు.భూములు కోల్పోతున్న రైతులకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలి. మంత్రిగారు పది రోజులు టైమ్ తీసుకొని రైతులతో మాట్లాడాలి. భూమి కోల్పోయే ప్రతి రైతును పిలిచి మాట్లాడాలి. వారికి న్యాయం చేద్దాం. కలెక్టర్ ద్వారా అండర్ టేకింగ్ ఇప్పించాలి. పాలమూరు రైతాంగానికి నష్టం జరిగితే నాకు, నా మంత్రులు, ఎమ్మెల్యేలకు నష్టం జరిగినట్లే. మీకు న్యాయం చేసే బాధ్యత నాది.

నారాయణపేట్, మహబూబ్‌నగర్ జిల్లాల కలెక్టర్లకు సూచన, రైతులను కార్యాలయాలకు పిలవడం కాదు. అధికారులే క్షేత్రస్థాయికి వెళ్లి రైతులను కలవాలి. రైతులతో మాట్లాడి ఒప్పించండి. మంచి నష్టపరిహారం ఇచ్చి ఒప్పించండి. నిధులకు ఇబ్బంది ఉన్నప్పటికీ పాలమూరు జిల్లా ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా నిధులు అందిస్తున్నాం. బ్రహ్మోస్ మిస్సైల్ ఇక్కడ ఉత్పత్తి చేస్తే, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. రెసిడెన్షియల్ స్కూళ్లతోపాటు, ఏటీసీలు అందుబాటులోకి తెచ్చి, యువతకు నైపుణ్యాలు నేర్పిస్తున్నాం. పాలమూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో ఏటీసీలు ఉండాల్సిందే. తద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. పాలమూరు పేదరికాన్ని ప్రదర్శనగా చూపడం కాదు. ఇక్కడి అభివృద్ధిని, విద్యా సంస్థలను, సాగునీటి ప్రాజెక్టులను చూడటానికి విదేశీ బృందాలు రావాలి. ఇక్కడి పరిశ్రమలు స్థానికులకే కాదు, ఇతర రాష్ట్రాల వారికీ ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి. ఈరోజు ఎస్‌జీడీ – కార్నింగ్ సంస్థ అమెరికా, జర్మనీ దేశాల జాయింట్ వెంచర్. ఇలాంటి సంస్థలు మరిన్ని ఈ ప్రాంతాని రావాలి.ఎయిర్ పోర్టుకు దగ్గరగా ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాలో డ్రైపోర్టు ఏర్పాటును పరిగణలోకి తీసుకుంటాం. హైదరాబాద్ – బెంగళూరు డిఫెన్స్ కారిడార్‌గా తీర్చిదిద్దుదాం. పరిశ్రమల కోసం అందుబాటులో ఉన్న భూముల వివరాలు కలెక్టర్లు సేకరించి ఇస్తే, ఏ కొత్త పరిశ్రమ వచ్చినా పాలమూరులోనే నెలకొల్పే ప్రయత్నం చేస్తాను" అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి , లోక్‌సభ సభ్యుడు డాక్టర్ మల్లు రవి , ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పేదల భవిష్యత్తుకు చదువే మార్గం

- అందుకు ఎంతైనా ఖర్చు చేయడానికి సిద్ధం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమం

బలగం టీవీ, హైదరాబాద్



నిరుపేదల భవిష్యత్తు బాగుండాలంటే చదువు ఒక్కటే మార్గమని, వారి చదువుల కోసం ప్రభుత్వం ఎంతైనా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు మరోసారి స్పష్టం చేశారు. పేదలకు చదువు చెప్పించి సమాజంలో ప్రయోజకులను చేయాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం బెండలపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, వాకిటి శ్రీహరి గారితో కలిసి పాల్గొన్నారు. అనంతరం దామరచర్లలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

"నిరుపేదలకు పంచడానికి ప్రభుత్వం వద్ద భూములు అందుబాటులో లేవు. పేదవాడి బాధలు తీరాలంటే చదువు కోవడం ఒక్కటే మార్గం. చదువు చెప్పించి మిమ్మల్ని ప్రయోజకులను చేయాలన్న సంకల్పంతోనే వంద నియోజకవర్గాల్లో ఇంటిగ్రేడెట్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభిస్తున్నాం. హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచాం.స్థానికంగా ఉపాధి అవకాశాలను మెరుగు పరచడంతో పాటు సింగపూర్, దక్షిణ కొరియా, జపాన్ లాంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఐటీఐలన్నింటినీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చాం. పేదవారి బతుకులు బాగుపడాలంటే, పేదవాడు పరిపాలన చేయాలంటే, ఇంజనీర్లు, డాక్టర్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లు కావాలంటే చదువొక్కటే మార్గం. చదువుకోండి. అందుకు ఏం కావాలో అడగండి. ఎవరో సాయం చేయాలని ఎదురుచూసే స్థాయి నుంచి పేదవాడు నలుగురికి సాయం చేసే స్థాయికి ఎదగాలి.

రాష్ట్రంలో ఏ చిన్న తప్పిదం జరక్కుండా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్నాం. మంత్రి పొంగులేటి గారు తనకు అప్పగించిన శాఖను సమర్థవంతంగా నిర్వహిస్తూ మొదటి విడతలో 4.5 లక్షల నిరుపేద కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చుతున్నారు.గ్రామాల్లో పేదరికాన్ని చూశాం. గ్రామ స్థాయి నుంచి ఈరోజు జాతీయ స్థాయి రాజకీయాలు మాట్లాడుతున్నామంటే.. పేదరికమంటే ఎలా ఉంటుందో చూశాం కాబట్టే మాట్లాడగలుగుతున్నాం. గ్రామాల్లోనే పుట్టాం. అక్కడే పేదలతో కలిసి భోజనాలు చేశాం. అది మా జీవన విధానంలో ఒక భాగం. అందుకే పేదరికాన్ని రూపుమాపాలని ఒక బాధ్యతగా తీసుకుని పనిచేస్తున్నాం.

ఇందిరమ్మ ప్రభుత్వంలో ఆనాడు పోడు భూములకు పట్టాలు పంపిణీ చేశాం. వైఎస్ రాజశేఖర రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఉచిత కరెంట్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ ఇచ్చాం.ప్రజలు రేషన్ కార్డుల కోసం కండ్లు కాయలు కాసేలా ఎదురుచూశారు. ఇప్పుడు ఇందిరమ్మ ప్రభుత్వం రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, సన్న బియ్యం ఇస్తున్నాం. మా ఇళ్లల్లో ఏ సన్నబియ్యం తింటున్నామో పేదోడి ఇంట్లో కూడా అదే సన్నబియ్యం తింటున్నారు. ఈ సంక్షేమ పథకాలన్నీ ఇందిరమ్మ ప్రభుత్వంలోనే సాధ్యమైంది" అని వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీలు పోరిక బలరాం నాయక్ గారు, రామసహాయం రఘురాం రెడ్డి గారితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన శాసనసభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# చెప్పుల జాతరగా హామీల జాతర

(మొదటి పేజీ తరువాయి)

చెప్పుల జాతరగా మారింది. పీఏసీఎస్ కేంద్రాల వద్ద రైతులు చెప్పులు పెట్టి యూరియా కోసం నిరీక్షించే పరిస్థితి వచ్చింది" అని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని కేటీఆర్ మరింత పదునైన వ్యాఖ్యలు చేశారు. "రేవంత్ రెడ్డి నిజాయితీగల్ల మోసగాడు. ప్రజలు మా చేతుల్లో మోసపోవాలని కోరుకుంటారని, అదే చేశారని ఆయనను రైతులే ఎద్దేవా చేస్తున్నారు" అని కేటీఆర్ ఆరోపించారు.

# జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టు ఎలా అందింది

(మొదటి పేజీ తరువాయి)

మాజీ ముఖ్యకార్యదర్శి, రిటైర్డు ఐఏఎస్ అధికారి శైలేంద్ర కుమార్ జోషిని హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై 10న జరిగే విచారణలో చెప్పాలంది. జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టు అమలును నిలిపివేయా లంటూ జోషి దాఖలు చేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. కమిషన్ కాపీ ఎలా అందిందని హైకోర్టు ప్రశ్నకు పిటిషనర్ లాయర్ స్పందిస్తూ, ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిందనీ, ఆన్‌లైన్‌లో రిపోర్టు ఉందని చెప్పారు. అసెంబ్లీలో పెడితే ఎమ్మెల్యేలకే రిపోర్టు అందు తుందనీ, ఆన్‌లైన్‌లో రిపోర్టు తీసేయాలని గతంలోనే ఆదేశించామని చెప్పింది. ఈ వ్యవహారంపై అఫిడవిట్ దాఖలు చేస్తామని న్యాయవాది అన్నారు. అప్పటివరకు కమిషన్ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే కేసీఆర్, హరీశ్‌లకు వెసులుబాటు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిందనీ, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం ఉందని లేకపోతే పిటిషనర్ ప్రతిష్టకు నష్టం జరుగుతుందని చెప్పారు. కమిషన్ యాక్ట్‌లోని సెక్షన్ 8(బి), 8(సి) కింద నోటీసు ఇవ్వలేదనీ, సాక్షిగా పిలిచిన కమిషన్ ఏకపక్షంగా ఆరోపణలు చేస్తూ రిపోర్టు ఇచ్చిందన్నారు. విధుల నిర్వహణ సరిగా చేయలేదని కమిషన్ తేల్చడం ఏకపక్షమన్నారు. దీనిపై ప్రభుత్వ స్పందిస్తూ, గతంలో ఆన్‌లైన్‌లో ప్రభుత్వం రూపొందించిన కమిషన్ ఇచ్చిన రిపోర్టును బ్రీఫ్ చేయించింది ఉంచారనీ, హైకోర్టు ఆర్డర్ తర్వాత తొలగించామని చెప్పారు. విచారణ ఈనెల 10కి వాయిదా పడింది.

ప్రభుత్వ, గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే ఆహార నాణ్యతాప్రమాణాల అమలు గురించి వివరించాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆహార మెనూ వివరాలు, వాటి అమలు తీరుపై కౌంటర్ వేయా లంది. జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం పాఠశాలల్లో విద్యార్థులకు ఆహారం ఉండటం లేదనీ, సౌకర్యాల లేమితో విద్యార్థులు ఇబ్బందులకు గురౌతున్నా రంటూ అఖిల్ శ్రీగురుతేజ పిల్ వేశారు. చీఫ్ జస్టిస్ పీకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌లతో కూడిన బెంచ్ ఈ పిల్‌ను విచారించింది. ఒక పాఠశాలలో కలుషిత ఆహారం కారణంగా వందకుపైగా బాలికలు ఆస్పత్రిపాల య్యారని చెప్పారు. పాఠశాల స్థాయిలో ఉన్న కమిటీల పర్యవేక్షణలో తనిఖీలు, ఆహార పరిశీలన చేశాక ఫొటోలు తీసి అధికార వెబ్‌లో పోస్టు చేయాలనే నిబంధన లను కాగితాలకే పరిమితం అయ్యాయని చెప్పారు. క్షేత్ర స్థాయిలో నిబంధనలు అమలు కావడం లేదన్నారు. దీనిపై ప్రభుత్వ ప్లీడర్ స్పందిస్తూ, ఎక్కువ కారం వేయడం వల్ల వందకుపైగా బాలికలు అస్వస్థతకు గురయ్యారనీ, వంట మనిషిని తొలగించామని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షణకు ప్రభుత్వ ప్రతినిధితో టాస్క్‌ఫోర్సు కమిటీలు ఉన్నాయన్నారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయు లు కూడా రోజూ భోజనం చేస్తే క్షేత్ర స్థాయిలోనే సమస్యలను గుర్తించేందుకు వీలుంటుందని హైకోర్టు అభిప్రాయపడింది. విద్యార్థులకు కూడా వంట పనిలో భాగస్వామ్యం కల్పిస్తే కూడా వారిని పని అలవడం జరుగు తుందనేది తమ వ్యక్తిగత అభిప్రాయమని చెప్పింది. విచారణను 19వ తేదికి వాయిదా వేసింది.

# యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల




నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ వారి ఆధ్వర్యం లో సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో మేరా యువ భారత్ (మై భారత్) ఫ్లాగ్ షిప్ స్కీమ్స్ కేంద్ర ప్రభుత్వ పథకాల పైన వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ముఖ్య అతిథిగా హాజరయిన నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ ఎం వెంకట్ రాంబాబు యువతను ఉద్దేశించి మాట్లాడుతూ మై భారత్ ఫ్లాగ్ షిప్ స్కీమ్స్ యొక్క ఉద్దేశాన్ని మై భారత్ నిర్వహించే వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అదే మాదిరిగా ప్రకృతి ద్వారా వచ్చేటువంటి వివిధ ఉత్పత్తులను ఏ విధంగా మార్కెటింగ్ చేయాలి, ఎక్కడ చేయాలి, అనే అంశాల పైన వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అతిథులుగా హాజరైన సైబర్ క్రైమ్ అధికారి వెంకటరమణ సైబర్ నేరాల గురించి, నేరగాళ్ల గురించి , డిజిటల్ అరెస్ట్, హనీ ట్రాప్ గురించి తెలియజేశారు. ఎ. సంతోష్ కుమార్. ఎం సి ఆర్ హెచ్‌ఆర్డి రిసోర్స్ పర్సన్ మాట్లాడుతూ టైం మేనేజ్మెంట్ డిసిప్లేన్ అదే మాదిరిగా కొన్ని సైబర్ నేరాలకు సంబంధించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 60 మంది యువతి యువకులకు అతిథుల చేత ప్రభుత్వ పథకాల బుక్స్ ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో మై భారత్ వాలంటరీ గంగిపల్లి స్వామి కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ గ్రేడ్ 2 గ్రంథపాలకుడు బి శంకరయ్య, గ్రేడ్ 3 గ్రంథ పాలకుడు కే మల్లయ్య, త్రిశూల్ యూత్ అధ్యక్షుడు రాజు రావు, జింక అనిల్ నజీర్, యువతి యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కవిత రాజీనామా డ్రామా మాత్రమే

- కేంద్ర మంత్రి బండి సంజయ్

బలగం టీవీ, హైదరాబాద్

కవిత రాజీనామాతో తెలంగాణ ప్రజలకు ఏమాత్రం లాభం లేదని, ఇది కాంగ్రెస్–బీఆర్ఎస్ పార్టీల కలసి వేసిన డ్రామా మాత్రమేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. తెలంగాణలో ఎన్నికలు జరిగితే అధికారంలోకి రావడం బీజేపీయేనని ఆయన స్పష్టం చేశారు. బండి సంజయ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, కాంగ్రెస్ ఆ పార్టీకి వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. ప్రజలు ఈ ఇద్దరి పార్టీల నాటకాలను గుర్తిస్తున్నారని చెప్పారు. లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం తనవంతు సహాయం అందిస్తానని బండి సంజయ్ తెలిపారు. ఎంపీటీసీగా గెలిస్తే రూ.5 లక్షలు, జడ్పీటీసీ గెలిస్తే రూ.10 లక్షలు అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అసెంబ్లీలో వరదలు, రైతు సమస్యలు, ఉద్యోగాలు, పింఛన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చకు అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని కేసీఆర్ సొంత కూతురే చెప్పిందని గుర్తు చేశారు. కాళేశ్వరం కుంభకోణం దేశంలోనే అతిపెద్దదని, దానిని సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేసినా ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని అన్నారు.

## బొమ్మ నోట్లతో మోసాలకు యత్నం.. నలుగురు అరెస్ట్

- రూ.21 వేలు, బొమ్మ నోట్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు..
- చిన్న పిల్లలు ఆడుకునే టాయ్ మనీ (కార్టూన్ పేపర్స్)ను డబ్బులుగా చూపించి మోసాలకు పాల్పడే యత్నం
- ఇన్‌స్పెక్టర్ కృష్ణ



**బలగం టీవీ, సిరిసిల్ల**

చిన్నపిల్లలు ఆడుకునే బొమ్మ నోట్లతో ప్రజలను మోసం చేయాలని ప్రయత్నించిన నలుగురు వ్యక్తులను సిరిసిల్ల పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ. 21,000/- నగదు, 14 కట్టల బొమ్మ రూ.500 నోట్లు, ఒక కారు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం, శ్రీనివాస్, సంతోష్, రమేష్, నరేష్ అనే నలుగురు వ్యక్తులు హైదరాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తి వద్ద బొమ్మ నోట్లను కొనుగోలు చేశారు. ఈ బొమ్మ నోట్లను అసలు నోట్ల మధ్య పెట్టి షాపింగ్ చేస్తూ ప్రజలను మోసం చేయాలని సిరిసిల్లకు వచ్చారు. నమ్మదగిన సమాచారం మేరకు సిరిసిల్ల గాంధీ చౌక్ వద్ద తిరుగుతున్న వీరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు, కేసు నమోదు చేయడం జరిగిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



# బతుకమ్మ తెప్పల నిర్మాణానికి భూమి పూజ

- రుద్రంగి మండలంలో శంకు స్థాపన చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**బలగం టీవీ, రుద్రంగి**

రాజన్న సిరిసిల్ల జిల్లా, రుద్రంగి మండల కేంద్రంలోని అచ్చయ్యకుంట, రామకృష్ణాపూర్ పల్లె, ఎల్లయ్య కుంటల వద్ద రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న బతుకమ్మ తెప్పల నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, ముందుగా కొబ్బరికాయ కొట్టి, భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ, గ్రామాలలో చెరువుల సుందరీకరణ, కట్టల నిర్మాణం, బతుకమ్మ ఘాట్ల ఏర్పాటు, తెప్పల నిర్మాణం వంటి పనులను ప్రభుత్వం పెద్దఎత్తున చేపడుతుందని తెలిపారు. ముఖ్యంగా, మండల కేంద్రంతో పాటు గ్రామాలలో చెరువులను అభివృద్ధి చేయడంతో పర్యావరణ పరిరక్షణతో పాటు, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## గ్రామంలోని అన్ని గణపతి విగ్రహాలకు చందా అందజేసిన మాజీ సర్పంచ్ జితేందర్..

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగపూర్ గ్రామ మాజీ సర్పంచ్ గ్రామంలోని అన్ని కుల సంఘాలు, యూత్ సభ్యులు నెలకొల్పిన గణనాథుడి విగ్రహాలకఅన్నింటికి కలిపి మొత్తం యాభై వేల రూపాయలను చందా రూపకంగా అందజేసి తన భక్తిని చాటుకొన్నారు. ఈ సందర్భంగా గణపతి మండపాల నిర్వాహకులు మాజీ సర్పంచ్ గోడిసెల జితేందర్ గౌడ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని కులాల సంఘాల సభ్యులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు

# కేసీఆర్‌ను బద్నాం చేసే దురుద్దేశ్యమే సీబీఐ విచారణ..




- బీఆర్ఎస్ నాయకుడు కంచర్ల రవి గౌడ్

**బలగం టీవీ, సిరిసిల్ల**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) ని బద్నాం చేయాలనే దురుద్దేశంతోనే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు ఆదేశించారని బీఆర్ఎస్ నాయకుడు కంచర్ల రవి గౌడ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇది చాలా దురదృష్టకరమని ఆయన అన్నారు. బుధవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవనాడి అని, ఇది రైతుల కళ్లలో ఆనందం నింపిందని రవి గౌడ్ పేర్కొన్నారు. అలాంటి ఒక అద్భుతమైన ప్రాజెక్టుపై సీబీఐ విచారణ అంటే తెలంగాణ రైతుల హృదయాన్ని గాయపరచడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సాగునీరు అందించిన ఘనత కేసీఆర్ గారిదేనని, అలాంటి మహానాయకుడిని ఎలాగైనా బద్నాం చేసి, తెలంగాణలో బీఆర్ఎస్ ఉనికిని నాశనం చేయాలని కుట్రలు జరుగుతున్నాయని, అయితే తెలంగాణ ప్రజలు వీటిని గమనిస్తున్నారని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ సాక్షిగా 'కాళేశ్వరం కమిషన్' పేరుతో బురద జల్లడం అత్యంత దుర్మార్గమని రవి గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో హరీశ్ రావు మాట్లాడుతుంటే 33 సార్లు అడ్డుకున్నారని, ఇది వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకే ఈ రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందని తెలంగాణ ప్రజలు గ్రహిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ తెలంగాణను సాధించిన మహానాయకుడని, రాష్ట్రం ఉన్నంత కాలం ఆయన తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని రవి గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వడ్లూరి సాయి సూర్య, కాసర్ల శ్రీనివాస్, యశ్వంత్, అక్రమ్, మహేష్, మున్నా, వడ్లూరి వేణు, కోడం వెంకటేశం, పరకాల హర్షిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌పై కుట్రకు పాల్పడుతున్న రేవంత్ రెడ్డి

- రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు
- ఇల్లంతకుంట లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం
- బీఆర్ఎస్ నాయకులు, పోలీసుల మధ్య తోపులాట



**బలగం టీవీ, ఇల్లంతకుంట**

సీఎం రేవంత్ రెడ్డి కి పాలన చేతకాక నే కేసీఆర్ పై కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నాడని రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు అన్నారు.మంగళవారం ఇల్లంతకుంట లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ ను, పిసి ఘోష్ కమిషన్ ప్రతులను బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు దహనం చేశారు. ఈ సందర్భంగా సిద్ధం వేణు మాట్లాడుతూ సమైక్యాంధ్ర పాలనలో తెలంగాణ రైతులు వలసలు పోతుంటే , రాష్ట్రం ఏర్పాటయ్యాక రైతులు వలసలు పోవద్దని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి కోటి ఎకరాలకు సాగు నీళ్లు ఇచ్చారనీ,కేసీఆర్ చేసిన తప్పేంటని ప్రజలు కాంగ్రెస్ పై దుమ్మెత్తిపోస్తున్నారన్నారు. సాగునీళ్లు ఇస్తే కేసీఆర్ పై సీబీఐ. కేసులు పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపు ఆలోచనలు చేయడం సిగ్గుచేటన్నారు ప్రజల్లో ప్రభుత్వానికి వస్తున్న వ్యతిరేకను డైవర్షన్ చేసేందుకే సీఎం రేవంత్ రెడ్డి కుటీల రాజకీయాలు చేస్తున్నాడనీ మండిపడ్డారు.కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి ఉండకుంటే తెలంగాణ రైతాంగం ఇప్పటికి వలసలు పోయేవారనీ,కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి తెలంగాణ రైతుల బ్రతుకులు మార్చిన అపరభగీరథుడు కేసీఆర్ అని ఆయన అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి,చంద్రబాబు కలిసి కేసీఆర్ పై కక్ష్య సాధింపునకు దిగుతున్నారన్నారు.సీఎం రేవంత్ రెడ్డి చంద్రబాబు డైరెక్షన్ లో పని చేస్తున్నారనీ,కేసీఆర్ పై ఈగవాలిన తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డిని తరిమికొడతారనీ ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల మాజీ సర్పంచ్ లు కేతిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, ఉడతల వెంకన్న , బొల్లం వెంకన్న, గోడిసెల జితేందర్ గౌడ్, కముటం రాములు,బిల్లవేని పరశురామ్, గుండా ముత్తయ్య, కొట్టే వెంకన్న అరె కొమురయ్య, ఎండి సాదుల్, వోల్లాల రవి గౌడ్, ఆకుల శ్రీనివాస్, సావనపల్లి అనిల్ కుమార్, ర్యాగటి రమేష్, ఎంద్ర చందన్, శ్రీధర్, బాబు, పండుకు భాస్కర్, చిలువేరు సంతోష్ రెడ్డి, కూనబోయిన రఘు, బుర్ర బాలకిషన్, వడియాల సురేందర్ రెడ్డి, బొప్ప శీను, కుమార్ యాదవ్, పసుల బాలరాజ్, ముస్కె నరేష్,దయ్యాల మహేష్ సమీర్, కార్తీక్, దమ్మని మధు, కదురు శేఖర్, రాజేశం,బండారి మహేష్, గుంటి మధు, కుడుముల నాగరాజు,నాగరాజు, శ్రీనివాసరెడ్డి, తిరుపతి, బెంద్రం తిరుపతిరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు





**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ పూజ కార్యక్రమం నిర్వహించి తీర్థప్రసాదాలు తీసుకొన్నారు. అనంతరం సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారని, జిల్లా పరిదిలో ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది తాము మొదలు పెట్టిన పనులు ఎలాంటి విఘ్నాలు లేకుండా పూర్తి అయ్యేటట్లు చూడాలని మహాగణపతిని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగింది. ముఖ్యంగా జిల్లా పోలీసు శాఖ సూచించిన మేరకు ఆయా మండపాల నిర్వాహకులు, యువత జాగ్రత్తలు తీసుకోవడం కనిపించిందని, ఇదే విధంగా నిమజ్జనం రోజు వరకు ప్రతి ఒక్కరు పోలీస్ వారికి సహకరించాలని ఎటువంటి ఆటంకాలు లేకుండా నిమజ్జన శోభయాత్ర నిర్వహించుకోవాలని ప్రజలకు ఎస్పీ తెలిపారు.

అనంతరం పోలీస్ పోలీస్ కార్యాలయంలో గత ఏడూ రోజులుగా విశేష పూజలు అందుకున్న గణనాథుని శోభయాత్రను ఎస్పీ ప్రారంభించగా గణపతి దేవుని ప్రతిమను డప్పు వాయిద్యాలతో, పోలీస్ అధికారులు సిబ్బంది, పిల్లలు, మహిళల కోలాటం ఆట పాటలతో అందరు ఆనందోత్సవ నృత్యాలతో కోలాహలం మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి మానేరు నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య,సి.ఐ లు , ఆర్ఐలు, ఎస్.ఐ లు, కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భార్యను వేధించిన భర్తకు మూడేండ్ల జైలు శిక్ష

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

భార్యను వేధించిన భర్తకు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 10,000/- రూల జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించినట్లు ముస్తాబాద్ ఎస్.ఐ గణేష్ తెలిపారు. ఎస్.ఐ మాట్లాడుతూరాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన సదిమెల రామచంద్రం తన భార్య కనకవ్వను తరచూ మానసికంగా, శారీరకంగా వేధించేవాడని తెలిపారు. మద్యం సేవించి గొడవలు పెట్టడంతో పాటు 2016 డిసెంబర్ 2న ఉదయం 6 గంటల సమయంలో భార్యను దారుణంగా కొట్టాడని, టార్చ్‌లైట్‌తో దాడి చేసి గాయాలు చేశాడని తెలిపారు. వేధింపులు భరించలేక బాధితురాలు ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు నిందితుడు సదిమెల రామచంద్రం పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. అనంతరం అప్పటి ఎస్.ఐలు చిట్టిబాబు, ప్రవీణ్ చార్జ్‌షీట్ దాఖలు చేశారని తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ వాదించగా, ఎస్.ఐ గణేష్, సీఎంస్ ఎస్.ఐ శ్రవణ్, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ తో పాటు 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారన్నారు. రామచంద్రంపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి ప్రవీణ్ అతనికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించినట్టు ఎస్.ఐ గణేష్ తెలిపారు.

# తొక్కిసలాటపై విరాట్ కోహ్లీ స్పందన

**బలగం టీవీ, బెంగళూరు**




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఐపీఎల్ టైటిల్ విజయోత్సవాల్లో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనపై స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జూన్ 4న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన ఈ ఘటన ఫ్రాంచైజీ చరిత్రలోనే అత్యంత సంతోషకరమైన రోజు విషాదంగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఆర్‌సీబీ అధికారిక ఎక్స్ ఖాతాలో కోహ్లీ విడుదల చేసిన ప్రకటనలో "జూన్ 4న జరిగిన హృదయ విదారక ఘటన ఎవరూ ఊహించలేదు. మా ఫ్రాంచైజీకి ఇది అత్యంత సంతోషకరమైన క్షణంగా ఉండాల్సిన రోజు. కానీ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన అభిమానుల కోసం ప్రార్థిస్తున్నా. ఈ నష్టం ఇప్పుడు మనలో ఒక భాగం. ఇకపై మరింత జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా ముందుకు సాగుతాం" అని తెలిపారు.

పద్దెనిమిదేండ్ల నిరీక్షణ తర్వాత ఐపీఎల్ 2025 టైటిల్ గెలిచిన ఆర్‌సీబీ జట్టును సత్కరించేందుకు కర్ణాటక ప్రభుత్వం జూన్ 4న భారీ కార్యక్రమం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే చిన్నస్వామి స్టేడియం వెలుపల తొక్కిసలాట జరిగి 11 మంది మృతి చెందగా, 50 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ఆర్‌సీబీ యాజమాన్యం కీలక ప్రకటన చేసింది. మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం అందజేస్తామని ప్రకటించింది. ఇప్పటికే రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన ఆర్‌సీబీ, తాజాగా నష్టపరిహారాన్ని పెంచింది. 'ఆర్‌సీబీ కేర్స్' పేరిట ప్రత్యేక ఫండ్ ఏర్పాటు చేసి, గాయపడిన వారికి సహాయం అందజేస్తామని స్పష్టం చేసింది.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి జింబాబ్వే క్రికెటర్

**బలగం టీవీ, హరారే**




జింబాబ్వే స్టార్ క్రికెటర్ సికిందర్ రజా తన కెరీర్‌లో అరుదైన రికార్డు సాధించాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో ఆల్‌రౌండర్ల విభాగంలో తొలిసారిగా నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. శ్రీలంకతో జరిగిన రెండు వన్డేల్లో రజా అద్భుత ప్రదర్శన కనబర్చాడు. తొలి మ్యాచ్‌లో 92 పరుగులు, రెండో మ్యాచ్‌లో 59 పరుగులు చేసి మొత్తం 151 పరుగులు సాధించాడు. అదనంగా ఒక వికెట్ కూడా తీశాడు. ఈ ప్రదర్శనతో ఇప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న ఆఫ్ఘనిస్థాన్ ఆటగాళ్లు అజ్మతుల్లా ఒమర్జాయ్, మహమ్మద్ నబీలను వెనక్కు నెట్టి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. గతంలో 2023 డిసెంబర్‌లో రజా కెరీర్ బెస్ట్‌గా రెండో ర్యాంకులో నిలిచాడు. తాజా ప్రదర్శనతో బ్యాటింగ్ విభాగంలో కూడా తొమ్మిది స్థానాలు మెరుగుపరుచుకుని 22వ ర్యాంకుకు ఎగబాకాడు. బౌలింగ్‌లో ఒక స్థానాన్ని మెరుగుపరుచుకుని 38వ ర్యాంకులో నిలిచాడు.

శ్రీలంక ఓపెనర్ పతుమ్ నిస్సంక రెండు మ్యాచ్‌లలో 198 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు గెలుచుకున్నాడు. దీంతో ఏడు స్థానాలు మెరుగుపరచుకుని 13వ స్థానానికి చేరుకున్నాడు. అతనితో పాటు శ్రీలంక ఆటగాడు జనిత్ లియానగే (29వ ర్యాంకు), జింబాబ్వే క్రికెటర్ షాన్ విలియమ్స్ (47వ ర్యాంకు) కూడా తమ స్థానాలను మెరుగుపరుచుకున్నారు. దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో 4/22తో మెరిశాడు. ఈ ప్రదర్శనతో శ్రీలంక బౌలర్ మహీష్ తీక్షణను అధిగమించి బౌలర్ల విభాగంలో నంబర్ వన్‌గా నిలిచాడు. ఇక, టీ20 ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ బ్యాటర్లు ఇబ్రహీం జద్రాన్, సెదిఖుల్లా అటల్ అద్భుత ప్రదర్శన కనబర్చారు. పాకిస్థాన్‌పై రాణించిన జద్రాన్ 12 స్థానాలు మెరుగుపరచుకుని 20వ స్థానంలో నిలిచాడు. అటల్ మాత్రం 346 స్థానాలు ఎగబాకి 127వ ర్యాంకుకు చేరుకున్నాడు.

# రీ ఎంట్రీపై క్లారిటీ ఇచ్చిన ఇలియానా

**బలగం టీవీ, హైదరాబాద్**



ఒకప్పుడు టాలీవుడ్‌ను తన అందం, అభినయంతో కట్టిపడేసిన గోవా బ్యూటీ ఇలియానా డి'క్రజ్ తిరిగి సినిమాల్లోకి వచ్చే విషయంపై అభిమానులకు స్పష్టతనిచ్చారు. పెళ్లి, పిల్లల కారణంగా కొంతకాలంగా వెండితెరకు దూరంగా ఉన్నా, నటనకు గుడ్‌బై చెప్పలేదని ఆమె తెలిపారు. తాజాగా నటి నేహా ధూపియాతో జరిగిన లైవ్ సెషన్‌లో పాల్గొన్న ఇలియానా తన వ్యక్తిగత జీవితం, కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ప్రస్తుతం తన పూర్తి సమయం ఇద్దరు కుమారులకే కేటాయిస్తున్నానని చెప్పిన ఆమె "సినిమాల్లోకి తిరిగి రావాలని బలంగా కోరుకుంటున్నాను. కెమెరా ముందు నటించడం, అద్భుతమైన వ్యక్తులతో కలిసి పనిచేయడం, సినిమా సెట్స్‌లో ఉండే వాతావరణం నాకు చాలా మిస్ అవుతున్నాయి. కానీ, ఇప్పుడు నా పిల్లలే నా ప్రపంచం. వారి ఆలనాపాలన చూసుకోవడం నా మొదటి ప్రాధాన్యత. అందుకే నటనకు విరామం ఇచ్చాను" అని వివరించారు.

ఇలియానా తన భర్త మైఖేల్ డోలన్‌తో కలిసి అమెరికాలోని హ్యూస్టన్ (టెక్సాస్)లో నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. తెలుగులో 'పోకిరి', 'జల్సా', 'రఖీ' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన ఇలియానా, 2012లో 'బర్ఫీ'తో బాలీవుడ్‌లో అడుగుపెట్టారు. అక్కడ కూడా 'బాద్‌షాహో', 'ఫటా పోస్టర్ నిక్లా హీరో' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు.

# కిష్కింధపురి ట్రైలర్ వచ్చేసింది




**బలగం టీవీ, హైదరాబాద్**

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ జంటగా తెరకెక్కిన ఫాంటసీ హర్రర్ థ్రిల్లర్ 'కిష్కింధపురి'. ఈ సినిమాతో కౌశిక్ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 12న విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో బుధవారం మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. రిలీజ్ చేసిన ట్రైలర్ ఇప్పటి వరకు వచ్చిన హర్రర్ సినిమాలకన్నా భిన్నంగా అనిపించింది. "ఊరికి ఉత్తరాన.. దారికి దక్షిణాన.. పశ్చిమదిక్కున ఉన్న ప్రేతాత్మలన్నీ పేరు వినగానే తూర్పుకు తిరిగే ప్రదేశం" అంటూ గంభీరమైన వాయిస్ ఓవర్‌తో ప్రారంభం కావడం ఆసక్తిని పెంచింది. హీరో, హీరోయిన్లు 'ఘోస్ట్ వాకింగ్ టూర్' పేరుతో ఓ పాడుబడ్డ ఇంట్లోకి వెళ్లడం, అక్కడ నిజమైన దయ్యాలు ఎదురుపడటం, "బ్రతుకు మీద తీపున్న వాళ్లు బ్రతకడానికి అర్హులు కార్" అంటూ వారిని భయాందోళనలకు గురి చేయడం థ్రిల్లింగ్‌గా చూపించారు. చివర్లో అనుపమ గాయాలపాలై బ్యాండేజీలతో కనిపించడం, అకస్మాత్తుగా ఆమెలోనే దయ్యం ఉందని చూపించి షాకిచేశారు. రేడియో ద్వారా ఆదేశాలు ఇచ్చే ఆత్మ కాన్సెప్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ హర్రర్ అంబియెన్స్‌కు పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యాయి.

'రాక్షసుడు' తర్వాత మళ్లీ జంటగా కనిపిస్తున్న బెల్లంకొండ–అనుపమా స్క్రీన్‌పై ఆకర్షణీయంగా ఉన్నారు. ముఖ్యంగా అనుపమా పాత్రలో వేరియేషన్స్ కనిపిస్తుండగా, బెల్లంకొండ దయ్యంతో తలపడే సీన్లు, డైలాగులు థ్రిల్లింగ్‌గా ఉన్నాయి.




# రాజ్ తరుణ్‌పై లావణ్య మరో కేసు

**బలగం టీవీ, హైదరాబాద్**

నటుడు రాజ్ తరుణ్‌పై మరోసారి కేసు నమోదైంది. గతంలో సంచలన ఆరోపణలు చేసిన లావణ్య అనే యువతి తాజాగా మళ్లీ పోలీసులను ఆశ్రయించింది. లావణ్య ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు రాజ్ తరుణ్‌తో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. తనపై దాడి చేయించడమే కాకుండా, దోపిడీకి పాల్పడ్డారని ఆమె ఆరోపించింది. కోకాపేటలోని ఓ విల్లాలో నివాసం ఉంటుండగా రాజ్ తరుణ్ కొందరిని పంపి మూడు వేర్వేరు సందర్భాల్లో బెల్ట్‌లు, గాజు సీసాలతో దాడి చేయించాడని పేర్కొంది. అంతేకాదు, తన ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను కూడా లాక్కెళ్లారని ఆరోపించింది. తన పెంపుడు కుక్కలను కూడా హతమార్చారని వాపోయింది.

ఈ ఘటన వెనుక కోకాపేట విల్లాకు సంబంధించిన వివాదమే ఉందని సమాచారం. 2016లో ఆ విల్లాను రాజ్ తరుణ్‌తో కలిసి కొనుగోలు చేశానని, వ్యక్తిగత విభేదాల కారణంగా ఈ ఏడాది మార్చిలో రాజ్ తరుణ్ ఆ ఇంటిని ఖాళీ చేశాడని లావణ్య తెలిపింది. ప్రస్తుతం ఆ విల్లా యాజమాన్య హక్కుల కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది. లావణ్య ఫిర్యాదు ఆధారంగా నార్సింగి పోలీసులు రాజ్ తరుణ్‌తో పాటు మణికంఠ తంబాడీ, రాజ్ శేఖర్, సుశి, అంకిత్ గౌడ్, రవితేజలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.




# అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో 'నిశాంఛి' ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**


బాలీవుడ్ సెన్సేషన్ డైరెక్టర్ అనురాగ్ కశ్యప్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'నిశాంఛి' ట్రైలర్ విడుదలైంది. అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ ఇండియా సమర్పణలో, జార్ పిక్చర్స్ బ్యానర్‌పై అజయ్ రాయ్, రంజన్ సింగ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో ఆయిశ్వర్య్ థాకరే బాలీవుడ్ హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. వేదిక పింటో, మోనికా పన్వార్, మహమ్మద్ జీషన్ అయ్యూబ్, కుముద్ మిశ్రా వంటి నటులు కీలక పాత్రల్లో నటించారు.

సెప్టెంబర్ 19, 2025న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా గ్యాంగ్‌స్టర్ కథాంశంతో తెరకెక్కింది. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో క్రైమ్, యాక్షన్, ఎమోషన్స్ మేళవించి ప్రేక్షకుల్లో ఆసక్తి రేపుతోంది. అనురాగ్ కశ్యప్ ప్రత్యేకమైన మేకింగ్ స్టైల్ కారణంగా ఈ సినిమాపై ఇప్పటికే బలమైన హైప్ ఏర్పడింది. ట్రైలర్ ఆకట్టుకోవడంతో, విడుదలకు ముందు నుంచే 'నిశాంఛి'పై అంచనాలు మరింత పెరిగాయి.

# గాడిదల గురించి ఎవరైనా ఆలోచించారా?

- **ప్రముఖ నటుడు కమల్ హాసన్**

**బలగం టీవీ, చెన్నై**



దేశవ్యాప్తంగా వీధి కుక్కల సమస్యపై చర్చ జరుగుతున్న వేళ, ప్రముఖ నటుడు కమల్ హాసన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "కేవలం కుక్కల గురించే ఎందుకు మాట్లాడుతున్నారు? ఒకప్పుడు మన కోసం బరువులు మోసిన గాడిదలు ఇప్పుడు కనుమరుగైపోయాయి. వాటి గురించి ఎవరైనా ఆందోళన వ్యక్తం చేశారా?" అని ప్రశ్నించారు. కమల్ 2001లో విడుదలైన 'ఆళవందాన్' చిత్రంలో చెప్పిన ఒక డైలాగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "నేను పెంచుకున్న కుక్కను నేనెలా చంపగలను? కానీ దానికి పిచ్చి పట్టితే మాత్రం చంపాల్సిందే" అనే ఆ డైలాగ్‌ను నెటిజన్లు షేర్ చేస్తూ కమల్ అప్పుడే ఈ సమస్యను గుర్తించారని చెబుతున్నారు. బుధవారం చెన్నై విమానాశ్రయంలో మీడియా ప్రతినిధులు ఈ అంశంపై ప్రశ్నించగా కమల్ హాసన్ "మనం సాధ్యమైనంత వరకు ప్రతి జంతువునూ కాపాడుకోవాలి. కానీ గాడిదల వంటి జంతువులు దశాబ్దాల పాటు మనకు సేవ చేసి ఇప్పుడు కనిపించడం లేదు. వాటిని రక్షించాలని ఎవరూ మాట్లాడటం లేదు. కేవలం కుక్కల విషయంలోనే ఎందుకు ఇంత చర్చ?" అని సమాధానమిచ్చారు.

ఇటీవల ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో రేబిస్ మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు వీధి కుక్కలను ఎనిమిది వారాల్లో షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. అయితే జంతు ప్రేమికుల అభ్యంతరాల కారణంగా కోర్టు ఆదేశాలను సవరించింది. రేబిస్ లక్షణాలు, విపరీత ప్రవర్తన ఉన్నవాటిని మాత్రమే వేరు చేయాలని, మిగతా కుక్కలకు వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసి తిరిగి వాటి ప్రాంతాల్లో వదిలేయాలని సూచించింది.

# లిటిల్ హార్ట్స్" సినిమా చూస్తుంటే మీ కాలేజ్ డేస్ గుర్తొస్తాయి

- **నటి శివానీ నాగరం**

**బలగం టీవీ, హైదరాబాద్**



"90 స్ మిడిల్ క్లాస్ బయోపిక్" ఫేమ్ మౌళి తనుజ్, "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్ లో నటిస్తున్న మూవీ "లిటిల్ హార్ట్స్". ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ్ రూపొందించారు. "90స్ మిడిల్ క్లాస్ బయోపిక్" ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ "లిటిల్ హార్ట్స్" మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాను నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి థియేట్రికల్ గా రిలీజ్ చేస్తున్నారు. "లిటిల్ హార్ట్స్" సినిమా ఈ నెల 5న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ షేర్ చేసుకున్నారు హీరోయిన్ శివానీ నాగరం.మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి నా చిన్నప్పటి స్నేహితుడు. ఆయన ద్వారా "లిటిల్ హార్ట్స్" ప్రాజెక్ట్ నా దగ్గరకు వచ్చింది. మంచి స్టోరీ ఉంది, విను అని సింజిత్ చెప్పాడు. డైరెక్టర్ సాయి మార్తాండ్ కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జైటింగ్ గా అనిపించింది. ప్రతి క్యారెక్టర్ ను డిజైన్ చేసిన తీరు బాగా నచ్చింది. అంబాజీపేట మ్యారేజి బ్యాండు మూవీ తర్వాత కొన్ని ఆఫర్స్ వచ్చాయి. కానీ సెలెక్టివ్ గా వెళ్లాలని వెయిట్ చేశాను. సినిమాను థియేటర్ దాకా వెళ్లి చూడాలంటే అందులో మంచి కంటెంట్ ఉండటం లేదు. అలా కంటెంట్ ఉన్న మూవీ చేయాలనే టైమ్ తీసుకున్నా. అంబాజీపేట మ్యారేజి బ్యాండు సినిమాలో లవ్ స్టోరీతో పాటు ఎమోషనల్ కంటెంట్ ఉంటుంది. "లిటిల్ హార్ట్స్" లో అలా కాదు. ఇది కంప్లీట్ లైట్ హార్టెడ్ మూవీ. కాలేజ్ డేస్ లో ఉండే ఫన్ తో సాగుతుంది. లవ్ స్టోరీ ఉన్నా, అందులో ఎమోషనల్ ఎలిమెంట్స్ ఉండవు.